
శాంతి సందేశం

(నాటిక)

(కొరియా ప్రజల వీరోచిత పోరాట గాథ)





రచయిత:

కొడాలి గోపాలరావు

 [వెల: 0—6—0

కృతజ్ఞత —

ఈ నాటికను ఆంధ్ర క్రాంతి థియేటర్ (పెదరావూరు సైద్ధాంతిక శాఖ) వారు, గుంటూరు మండల గ్రంథాలయ వార్షికోత్సవం (సంగం జాగర్లమూడిలో) నాటికల పోటీలో ప్రదర్శించి అక్కడ ఉత్తమ నటకులుగా ప్రశంశింపబడి, తరువాత పది ప్రదర్శనాల వరకు ప్రదర్శించి ఆంధ్ర ప్రజలకు సన్నుపరిచయం చేసినందులకు వారికి నా ధన్యవాదాలు.

ఈ నాటికను చూచి చదివి దీనిపై తమ అమూల్యమైన అభిప్రాయాల్ని యిచ్చిన శ్రీ మాకినేని బసవపున్నయ్యగారికి, శ్రీ ప్రయాగ కోదండరామశాస్త్రి గారికి, శ్రీ బొల్లిముంత శివరామకృష్ణగారికి కోసూరి పున్నయ్యగారికి నా అభివందనాలు.

దీని అడిగినంతనే ప్రచురించి ఆంధ్ర ప్రజలకు సన్నపరిచయం చేస్తున్న శ్రీ గాలి గోపాలకృష్ణమూర్తి గారికి. దీని గౌరవంగా ప్రదర్శించే సమాజాలవారికి నా కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు,
రచయిత: పెదరావూరు
29 — 4 — 52

అంకితం

పెద్ద ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ప్రజాభిమానాన్ని చూరగొని కొలది మాసాల క్రితం [illegible] సంతోషాల నాగార్జునకు [illegible] కామ్రేడ్ చుక్కపల్లి స[illegible] (ఉంటప్పటి [illegible]) యీ నాటకమ హృదయపూర్వకంగా అంకితం యిస్తూ, వారి లక్ష్యసాధనకు అంకిత భావులు కాగలరని ఆశిస్తున్నాను.


రచయిత:

"ఒక సమస్యను పరిష్కరిస్తే వేలకొలది ప్రభవిస్తాయి"

[illegible] —

"సందేశం" [illegible] మనస్సులుగా [illegible]
[illegible]వించిన దేశాలు[illegible], దేశాలు[illegible] [illegible]పొందిన [illegible]
[illegible]
[illegible]
దేశాలు[illegible], భారతదేశం [illegible]కి అప్పుడే [illegible]
[illegible] దేశభక్తుల [illegible], భారతీయ[illegible]
[illegible] ! [illegible]
[illegible] !

[illegible]
[illegible] "[illegible]" [illegible]
[illegible]
[illegible]
[illegible]



[illegible]
[illegible]
[illegible]

వాస్తవిక దృశ్యం

ఇంతసేపు ఈ "సందేశం" (నాటిక)ను మీతోపాటు నేను చూశాను. ఈ కథావస్తువు ఎక్కడిదో ఉత్తర కొరియాలోదైనా, కొలది దినముల క్రితము విశాలాంధ్రలో కాంగ్రెసు నిరంకుశపాలనగావించిన అత్యాచారాలకు నిదర్శనము. ప్రపంచములో "శాంతి" పేరుతో సామ్రాజ్యవాదుల దురాక్రమణను బహిరంగపరుస్తూ కొరియా ప్రజల వీరోచిత పోరాటాన్ని రచయిత బాగా చిత్రించాడు, ఈ నాటిక అన్నివిధాల ఆంధ్రప్రజలకు ఉపకరిస్తుందనుటలో సందేహము లేదు.


ఇట్లు,
మాకినేని బసవపున్నయ్యగారు.
(బహిరంగసభలో) తెనాలి. 3—4—53.

"సందేశం" (నాటిక) ప్రదర్శన చూచాను. చూస్తున్నంతసేపూ అది ఎక్కడిదో కొరియా గాథగాక నా తెలుగు నడిగడ్డమీదనే, నామీదనే జరుగుతూన్న అత్యాచారంగా భావిస్తాను. యీ నాటికలోని ప్రతి దృశ్యం, ప్రతిమాటా, యీ మహత్తరకాలంలోని తెలుగు జాతి హృదయవేదనను ప్రతిబింబిస్తోంది.

ఆ 15 నిమిషాల నాటికలో ప్రజల హృదయాలను ఉర్రూతలూగించింది. రచయిత, నటకులు ప్రశంసార్హులు.

ఏవో కొన్నిపాటి లోపాలున్నా ఇది ఈ నాటి తెలుగుకళా స్వరూపాలలో ఉన్నతస్థాయినందుకొన్నదని నేననటం వాస్తవం.

18-4-53 ముంత శివరామకృష్ణ.



F

సందేశం

(నాటిక)

రంగస్థలం

[తెర]

సీను:- (అది ఉత్తర కొరియాలోని ఒక గ్రామం. - ఆ గ్రామంలో ఒక గ్రంథాలయం. తెర లేవకముందే గ్రంథాలయం లోపలి భాగంలో నుండి, విషాదమైన మూల్గు వినిపిస్తుంది. ఆ గ్రంథాలయ మేనేజర్ ఆతన్ని, అమెరికన్ సోల్జర్లు క్రూరంగా బాదుతూవుంటారు. (తెర లేచే సరికి) ఆతన్ని ఒక బీరువాకు కట్టేసి చావమోదుతూ వుంటారు. బీరువాలన్నీ పగులగొట్టి గ్రంథాల్ని చిందరవందరగా విరజిమ్ముతారు. తాత శరీరం రక్తంలో తడిసి వుంటుంది. తలపగిలి రక్తంకారుతూ వుంటుంది. సోల్జర్లు భయంకరంగా అరుస్తూవుంటారు)

1వ సైని:- చెప్పరా! చెప్పు!

2వ సైని:- ఎక్కడ దాచావు వాళ్ళని?

1వ సైని:- పలకవేం?

2వ సైని:- చెప్తావా? లేదా?

1వ సైని:- గుడ్లు పీకిస్తా

2వ సైని:- నీరక్తం త్రాగేస్తా!

1వ సైని:- ఎక్కడున్నార్రా గొల్లాలు?

2వ సైని:- చెప్పవేరా ముసలి 'గాడిద (బలంగా కొట్టారు తుపాకి మడిమలతో పొడిచారు)

1వ సైని:- గ్రంథాలయమట, గ్రంథాలయం.

2వ సైని:- నీ గ్రంథాలయాన్ని, నిన్ను బూడిదచేస్తాం !

1వ సైని:- మా అమెరికాపైనే కత్తికట్టావు ?

2వ సైని:- యింక చూస్తావేంరా ! ఈ గ్రంథాలయానికి నిప్పంటించు, తగలబెట్టు.

1వ సైని:- దొంగముండాకొడకా ! చూడు నిన్నేం చేస్తామో ! (లోపలికివెళ్ళి కొన్ని గ్రంథాలు తెచ్చి, విరజిమ్మి, కొన్ని చించి, కాళ్ళతో మట్టగించి వేశాడు. రెండవ సైనికుడు నిప్పుల్లగిచి గ్రంథాలు చించిన తుక్కులో నిప్పుపెట్టాడు, పైశాచికంగా నవ్వాడు)

2వ సైని:- గ్రంథాలయం, యిదిగోచూడు గ్రంథాలయం. (యిద్దరూ నవ్వుతూ వేడితగలగానే మంటదగ్గరకు జేరారు.)

1వ సైని;- అబ్బా ! ఎంత చలిరా !

2వ సైని:- కాళ్ళు చేతులూ కొంగర్లు పోతున్నయి.

1వ సైని:- ఒక్క కాళ్ళూ చేతులేమిట్రా : శరీరమంతా చలికి ముద్ద కట్టుకొని బిగుసుకు పోతూవుంది.

1వ సైని:- ఈ కొరియా వాళ్ళెట్లా బ్రతుకుతున్నార్రా ?

2వ సైని:- ఈ కుక్కలకు చలిలేదురా ! ఉంటే రెండవ నాటికే చావరు ?

1వ సైని:- వీళ్ళు చచ్చినా పీడ విరగడయ్యేది. ఈ వెధవలు

నల్గురున్నారో లేదో యింత బలమైన అమెరికాను మూడు చెరువుల నీళ్ళు త్రాగిస్తున్నారే!

2వ సైని:- నేను పోయిన యుద్ధంలో యెన్ని సాహసకార్యాలు చేశాననుకున్నావు. అందుకు నాకు మెకార్థర్ చాలా బహుమానాలు కూడా యిచ్చాడు.

1వ సైని:- కొద్దిగా తెచ్చావేంరా! యింకా కొద్దిగా పుస్తకాలు తీసుకురా చలికాగుదాం.

2వ సైని:- ఈ లైబ్రరీ వుండబట్టి సరిపోయింది గాని, లేకపోతే చలికి యింకా చచ్చేవాళ్ళంరా!

1వ సైని:- ఏమిటోరా! మళ్ళీ నాకీ యుద్ధం ముగుస్తుందన్న ఆశ లేదురా!

2వ సైని:- నాకూ అంతేరా! మన భార్యా పిల్లల్ని వదలి ఈ దిక్కుమాలిన కొరియాలో యుద్ధం చేయటానికి వచ్చినదగ్గరనుండీ నాకు మళ్ళీ ఇంటికి తిరిగివెళతానన్న నమ్మకం లేదురా!

1వ సైని:- నేనిక్కడకు వచ్చిన దగ్గర నుండీ యేం చేయాలన్నా, ఏం తినాలన్నా, ఎక్కడ నిద్రపోవాలన్నా నాకు యేమిటో భయంగా వుందిరా!

2వ సైని:- నాకూ అంతేరా! మనం యిక యెన్ని సంవత్సరాలు యుద్ధం చేసినా ఈ కొరియాను జయించలేంరా! (తాత పెద్దగా నవ్వాడు)

తాత:- మీ గోరీ ఈ గడ్డమీదనే కడతాం. కిరాతకుల్లారా! మా సాహిత్యాన్ని, మా దేశాన్ని యిలా నాశనం చేస్తారా!

1వ సైని:- ఏమన్నావురా! కుక్కా! గోరీకడతావు (తుపాకి మడమతో గుండెల్లో పొడిచాడు.)

2వ సైని:- ఈ చుట్టుప్రక్కల యెవళ్ళన్నా గెరిల్లాలు చచ్చారేమో చూడరా! లేకపోతే ఈవెధవ అట్లా మాట్లాడుతాడా! వృద్ధుకు, మెత్తగా తన్ని అడుగు ఆ గెరిల్లాలను యెక్కడ దాచాడో.

1వ సైని:- (ముఖం మీద బలంగా కొట్టి) చెప్పురా వెధవ చెప్పు! ఎక్కడున్నారు వాళ్ళు, ఏంచేస్తున్నారు ?

తాత:- నాకు తెలియదు.

2వ సైని:- తెలియదూ? చెప్పకపోతే నిన్నేం చేస్తామో తెలుసా?

తాత:- చంపేస్తారు, అంతేగా !

2వ సైని:- అంతేనా ? నిన్ను చిత్రవధచేస్తాం !

1వ సైని:- ఈ కుక్కల కొడుక్కు చావంటే భయంలేదురా ?

2వ సైని:- ఈ వొక్కడికే కాదురా ! ఈ కొరియా వాళ్ళకే చావంటే భయం లేదురా !

తాత:- ప్రాణభయంతో, మీ ఆయుధబలం చూచి, మా దేశ స్వాతంత్ర్యాన్ని ఆ అమెరికా రాబందులకు తాకట్టు పెడతా మనుకోకండి.

1వ సైని:- అమెరికన్‌లు రాబందులా !

2వ సైని:- (కొట్టి) గాడిద కొడకా ! దైవభక్తులైన అమెరికన్‌లనే నిందిస్తావు.

1వ సైని:- వీడిని కాల్చివేయురా !

తాత:- నన్ను చంపినా, నా ఆశయాల్ని, నా దేశ స్వాతంత్ర్యాకాంక్షను చంపలేవు.

2వ సైని:- ఏమన్నావురా, గాడిదా! (ముఖంమీదకొట్టాడు)

(యింతలో బయట తుపాకి కాల్చిన శబ్దం వినుపిస్తుంది. అమెరికన్ సోల్జర్లు అదరిపడతారు. భయంతో కంపించి ఒక దిక్కుకేసి చూచి అమ్మో గెరిల్లాలు అంటూ ఒకళ్ళపైన ఒకళ్ళు త్రొక్కుకుంటూ పారిపోతారు. దొడ్డిదారిని యింతలో సేన్ గబగబా లోపలికివస్తాడు)


తాత:- వచ్చావా బాబూ! నీకేం ప్రమాదం జరుగలేదుగదా! మన వాళ్ళంతా క్షేమంగా వున్నారా! ఈగ్రామంలో అమెరికన్ సైనికుల్లేరూ?

సేన్:- (కళ్ళు ఊడదీస్తూ) లేదు, అంతా బాగానే వున్నాం నాన్నా. మన ప్రజాసైన్యాలు గ్రామ పొలిమేరల వరకూ వత్తుకు వచ్చినై నాన్నా. నిన్ను కాల్చివేశా రేమో ననుకున్నా.

తాత:- నన్ను కాలుస్తారా! నన్ను కాల్చినా నేను చింతించే వాడిని కాదు. మన సాహిత్యాన్ని, మన దేశాన్ని యెలా భోగిమంటలు వేస్తున్నారో చూడు సేన్.

సేన్:- మళ్ళీ ఆ అమెరికన్లు వస్తారేమో నాన్నా. మనం తక్షణం యిక్కడ నుండి వెళ్ళిపోవాలి. గబగబా పుస్తకాలన్నీ యేరి పోగుపెట్టాడు)

తాత:- వచ్చినా పరవాలేదు. ఏ ప్రమాదాలు రాకమునుపే నీవు యిక్కడనుండి వెళ్ళునాయనా. నా ప్రాణముండగా నేను ఈ గ్రంథాలయాన్ని ఐదలి రాలేను. ఆ అమెరికన్ బందిపోట్లు ఈ గ్రంథాలయాన్ని యిలా నాశనంచేస్తూ వుంటే యెలా రమ్మంటావు సేన్.



సేన్:- నువ్వు ఒక్కడవి యిక్కడుండి యేం చేయగలవు నాన్నా. ఈ ఒక్క గ్రంథాలయమేనా! మనం యెన్నో ఏళ్ళుగా శ్రమించి, గడించుకొన్న సాహిత్య సంస్కృతులే కాదు; ఈ గ్రామంలో ఏ మేడ, ఏ విద్యాలయం, ఏ ప్రభుత్వభవనం, ఏ వైద్యాలయం, ఏ భూమిమిగిలింది? సుందరతరమైన నందన వనంలాంటి ఈ గ్రామం సర్వ స్మశానమైపోయింది నాన్నా.

తాత:- ఈ ఆసియా వాసుల ప్రాణాల్ని, దేశాల్ని గడ్డిపరకల్లా కాల్చివేస్తున్నారు. శాంతిరక్షణ పేరుతో ఈ కొరియా గడ్డమీద పడి బూడిద చేస్తున్నారు.

సేన్:- ముక్కోటి కొరియన్ ప్రజలు ఒక్కటిగా బ్రతకాలనటమే ఒక నేరం అయిపోయింది. పోయిన రెండవ ప్రపంచ యుద్ధంలో జపాను ఫాసిస్టులు చీల్చిన ఈ మాతృదేశాన్ని ఐక్యం చేయాలనటమే మనం చేసిన అపరాధం.

తాత:- మన మంతా యేకంగావుంటే వాళ్ళ దోపిడీ విధానం యెలా సాగుతుంది బాబూ. మన సిరిసంపదల్ని కొల్లగొట్టటానికి, మనల్ని బానిసలు చేసి, పెత్తనం చేయటానికి, వాళ్ళు ఈ నాగు మన స్వతంత్ర పోరాటాన్ని అణుస్తున్నారు. మన ఐక్యకొరియా ఉద్యమాన్ని రక్తపు ఓడుల్లో ముంచుతున్నారు.

సేన్:- ఈ నీచులు చేస్తున్న నరహత్యలకు మిత్రరాజ్యాల పేరుతో 50 దేశాల సైన్యాలు ఈ కొరియా గడ్డమీద బాంబులు వేసి మన మాతృదేశాన్ని బూడిద పోగులు

చేస్తున్నయి. ఏ ఒక్క కొరియన్ బ్రతికివున్నా ఈ అమెరికన్ రాక్షసుల్ని ఈ గడ్డమీద గోరీ కట్టకుండా వదలి పెట్టడు నాన్నా. యిది ముమ్మాటికీ నిజం.

(యింతలో ఒక కొరియన్ యువకుడు పరుగెత్తుకుంటూ వచ్చాడు ఏడుస్తూ.)

యువ:- తాతా...తాతా...నాశనమై పోయాను, సర్వనాశనమై పోయాను తాతా.

సేన్:- నువ్వా

తాత:- ఏమిటి నాయనా? ఏమిటి? ఏం జరిగింది?

యువ:- నన్ను సర్వనాశనం చేశారు, తాతా.

సేన్:- ఆ అమెరికన్ లేనా?

యువ:- ఆ అమెరికన్ లేకాదు నీ అన్న సాంగ్జన్ కూడా. నా కుటుంబాన్నంతా పాడుచేశారు. (తాతతో) వాణ్ణి కని, పెంచి, మా లాంటి కుటుంబాల్ని నాశనం చేయటానికి వదలి పెట్టావా తాతా?

సేన్:- వాడా! నీచుడు. ద్రోహి. ఆ అమెరికన్ల బూట్లు మోసే గాడిద. నాకు అన్నలా అవుతాడు - వాడి పేరెత్తకు నాదగ్గర.

యువ:- ఈ గ్రామం మీదకు అమెరికన్లను తీసుకు వచ్చిందీ వాడే. ఈ గ్రామస్థుల్ని చంపిందీవాడే. ఈ గ్రామాన్ని తగలబెట్టిందీ వాడే. (తాతతో) వాడిని కన్నది నువ్వు. ఈ గ్రామ వినాశనానికీ, నాకుటుంబమరణానికీ కారకులు నువ్వు, నీ కొడుకూను,

తాత:- కొడుకు! వాడు నాకు కొడుకని చెప్పుకోవటం కూడా సిగ్గే. ఆ గాడిద పేరుయెత్తకు నా దగ్గర.

యువ:- నా తల్లి, నా చెల్లెల్ని, నా తండ్రిని అబ్బా! నా వాళ్ళం దర్నీ చంపారు తాతా.

సేన్:- నీ ఒక్కడి కుటుంబమే కాదు. ఎందరి తల్లులు, ఎందరి భార్యలు, ఎందరి భర్తలు, ఎన్ని కాపురాలు నాశనమై పోయినైయ్యో తెలుసా!

యువ;- స్వాతంత్ర్యం పేరుతో ఈ గ్రామానికి చిచ్చుముట్టిం చింది నువ్వే తాతా.

తాత:- ఆఁ!

యువ:-అధికార దాహంతో, ఈ గ్రామాన్ని యుద్ధగుండంలోకి ఈడ్చింది నీవు నీ కొడుకు. మీరంతా ద్రోహులే.

సేన్:- ఆ...మేమా ద్రోహులం...

యువ:-మీరే! ముమ్మాటికీ మీరే! స్వాతంత్ర్యం పేరుతో...

తాత:- నీకు స్వాతంత్ర్య మక్కర లేదు; నీకు దేశంఅక్కర్లేదు, నీకు స్వేచ్ఛ అక్కర్లేదు. ఆ అమెరికన్ల వాకిట కుక్కలా కావలి కాస్తానంటావు అంతేనా!

యువ:- అంతే! ముమ్మాటికి అంతే! ఈ దేశం యెలా పోయినా, ఈ దేశాన్ని యెవరు పాలించినా నాకిష్టమే. నా భార్యా, నా పిల్లలూ, నా కుటుంబం బాగుండాలి. అందుకోసమై ఈ అమెరికా వాళ్ళకే కాదు, ఏ తెల్ల వాళ్ళకైనా వెట్టి చేస్తాను.

సేన్:- ఛీ పిరికి వెధవా!

తాత:- స్వాతంత్ర్యం నా కోసమేనా? నీ కోసం కాదూ! నీ భార్యా పిల్లలచిరునవ్వులు చిందులాడాలని కాదూ? ఈ ముక్కోటి కొరియన్ ప్రజల నికృష్ట జీవితాన్ని బాగుచేయటానికి కాదూ ఈ స్వాతంత్ర్యం?

సేన్:- నాన్నా! అప్పుడే వీడి చరిత్ర మరచావా? మొన్నటి దాకా వీడి తండ్రి, లేనివాళ్ళ పొట్టలుకొట్టి, అధిక వడ్డీలతో కొరియన్ రైతుకూలీల రక్తమాంసాలు పిండుకు త్రాగలా? అధిక వడ్డీలతో ప్రజల్ని కొల్లగొట్టుకుతినే వాళ్ళకు స్వాతంత్ర్యం, శాంతి, దేనికి నాన్నా!

యువ:- ఈ స్వాతంత్ర్యం పేరుతోనే ఆనాడు కూలిముండా కొడుకులకి నా ఆస్తినంతా పంచివేశారు. నన్ను పకీరుని చేశారు. నన్ను సర్వనాశనం చేశారు.

సేన్:- నాశనం చేశాము?

తాత:- ఆవేశపడకు బాబూ! నా భార్య చనిపోయిందీ ఈ యుద్ధంవల్లనే, నా మనుమళ్ళు చనిపోయిందీ యుద్ధం వల్లనే. నా కుమార్తె భర్తను పోగొట్టుకొని ఆ అమెరికన్ రాబందులచేత నడివీధిలో శీలాన్ని కోల్పోయింది ఈ యుద్ధం వల్లనే, నా పచ్చని కుటుంబమంతా బూడిద పోగులైపోయిందీ ఈ యుద్ధం వల్లనే. యిందర్ని పోగొట్టుకుందీ నా కోసమేనా! నేను యేం సుఖద్దామని చెప్పు?

సేన్:- నా న్నా......

తాత:- నా ప్రాణం కన్నా ప్రియమైన దీ గ్రంథాలయం. ఈవిజ్ఞానంకోసం, నాజీవితాన్నింతవరకూ ధారపోశాను.

ఈ సాహిత్యాన్ని, ఈ దేశాన్ని యిలా నాశనంచేస్తూ వుంటే మానవత్వం వున్నవాడు యెవడు సహిస్తాడు? మనం కుక్కలం గాదు, అమెరికాలో కుక్కకున్న స్వేచ్ఛ గూడా మనకు లేనప్పుడు మనం బ్రతికి దేనికి ?

(బయట తుపాకి కాల్పులు. దూరాన ఫిరంగి మోతలు, గ్రామంలో బాంబులు పడుతున్న శబ్దాలు, ప్రజల హాహా కారాలు వినిపిస్తుంటై. సేన్ కిటికీలో గుండా బయటకు చూస్తూ, ఆతృతగా.)

సేన్:- నాన్నా ! మన గెరిల్లాల్ని పట్టుకు వెళుతున్నారు.

తాత:- ఆ......(కిటికీగుండా చూచాడు)

సేన్:- అబ్బా ! వాళ్ళ వళ్ళంతా రక్తమే నాన్నా ! బాయ్‌నెట్లుతో పొడుస్తున్నారు.

తాత:- మన గెరిల్లాల్నా ?

సేన్:- ఔను, ఎక్కడికో తీసుకువెళ్ళుతున్నారు

తాత:- ఆ అమెరికన్ లేనా ?

సేన్;- ఔను నాన్నా ! ఆ అమెరికన్‌లతో కలసి, నీ కొడుకు సార్జంట్-ద్రోహి, రాక్షసుడు, గ్రామప్రజల గొంతులు కోయిస్తున్నాడు

(యింతలో కొరియన్ కార్మికుడు బాగా దెబ్బలు తగిలి అమితమైన దాహంతో వచ్చి కూలిపోతాడు)

కార్మి:- దాహం, దాహం, అబ్బా! దాహం.

తాత:- ఎవరు నాయనా! నువ్వా బాబూ !

సేన్:- ఔను నాన్నా, మన గెరిల్లా యోధుడే !

కార్మి:- అబ్బా! గొంతెండి పోతుంది, కామ్రేడ్ !

సేన్:- యిక్కడ నీళ్ళుకూడా లేవే! ఎట్లా ఈ కామ్రేడ్‌ని బ్రతికించటం ?

తాత:- బయట కెళితే సోల్జర్లు పసికడతారే!

యువ:- పసికట్టడం కాదు, ప్రాణం తీస్తారు!

సేన్:- నేనువెళ్ళి తెస్తానుండునాన్నా, ఈ దగ్గరలో ఎక్కడన్నా.

తాత:- వద్దు బాబు, వద్దు. నేను వెళ్ళి తెస్తానుండండి, మీరు బ్రతికి వుంటే దేశానికి సేవచేయగలరు. నా వయస్సు ఉడిగి పోయింది, నేను చచ్చినా...

సేన్:- కాదులే నాన్నా, నేను తెస్తానుండు. (వెళ్తాడు)

కార్మి:- అబ్బా-కామ్రేడ్స్! యింకా మీరిక్కడే వున్నారేం? వెళదాం రండి త్వరగా, లేకపోతే మనం అన్యాయంగా అమెరికన్‌ల చేతిలో చనిపోవాలిసొస్తుంది.

తాత:- కామ్రేడ్! ఎక్కడికి వెళదామంటారు, ఈ గ్రంథాలయాన్ని విడిచి, దేశ దేశాల నుండి అమూల్యమైన సాహిత్యం తెప్పించామే, ఈ గ్రంథాలయం కోసం నా జీవితంలో సగభాగాన్ని ఖర్చుచేశానే, దీని కోసమే జీవించాను, దీనికోసమే మరణిస్తాను. (నీళ్ళతో సేన్ వస్తాడు.)

సేన్:- మంచినీళ్ళు యివిగో కామ్రేడ్! (యిచ్చాడు తాత త్రాగించాడు, కార్మికుడు త్రాగి మెల్లగా లేచాడు.)

కార్మి:- అబ్బా! మంచినీళ్ళకోసం ప్రాణం పరితపించింది.

తాత:- మనవాళ్ళు సురక్షితంగా వున్నారుగా బాబూ! నీకేం దెబ్బలు తగల్లేదుగా ?

కార్మి:- లేదు తాతా, రెండు రోజుల నుండి మన గెరిల్లా సైన్యాలు తిండికి కూడా ముఖంవాచిపోయాయి. ఆఖరుకు త్రాగటానికి నీరుకూడా కరువైనయి. మీరు విన్నారా కార్మేడ్స్ ! మొన్న ఒక్క-రాత్రే సోల్ నగరంలో 15 వేలమంది అమాయక ప్రజల్ని ఉరితీసిగాని, కాల్చిగాని, చంపివేశారా ఆమెరికన్ హంతకులు. ఆమృతవీరుల అక్క-చెల్లెళ్ళను గుడ్డలూడదీసి గ్రామంలో ఊరేగించారట, ఆరువందల మంది పిల్లలు చదువుకుంటున్న పాఠశాలలపై దొంగపోటుగా బాంబులువేసి ఆ పసిపిల్లల్ని చంపివేశారా కసాయిలు.

తాత:- ఒక్క- ఆరువందలేమిటి ? ఈ కొరియా గడ్డమీద ఏ విద్యాలయం, ఏ పైరు, ఏ మేడ, ఏ పచ్చని భూమి మిగిలింది ? ముక్కు-పచ్చలారని యెందరో ముద్దుబిడ్డల్ని నిలువునా కాల్చి చంపారు.

సేన్:- ప్రతిరోజూ వందలకొలది టన్నుల క్రిమి బాంబులతో ఈ కొరియా గడ్డను ప్రతిఅంగుళం మేర ప్రేల్చి వేస్తున్నారా మిత్రరాజ్య సైనికులు.

కార్మి:-సంవత్సరం క్రితం ఈ భూమి మనది, ఈ పైరు, ఈ గని, ఈ ఖార్ఖానా, ఈ ఉత్తరకొరియా అంతా రైతుకూలీ ప్రజా రాజ్యంగా కళ కళ లాడుతూవుండేది, కాని యిప్పుడో . . .

యువ:- అంతా స్మశానం, పీనుగుల మయం తాతా. ఆరు రోజులకుపూర్వం నాకుటుంబమంతా కల కలా నవ్వుతూ

వుండేది. కాని యిప్పుడా మధుర దినాలు పోయినై
తాతా (ఏడ్చాడు)

తాత:- నీ ఒక్కడి కుటుంబమే కాదు; ఈ కొరియా గడ్డంతా కల కలా నవ్వుతూవుండేది. రెండవ ప్రపంచయుద్ధంలో జపాను ఫాసిస్టుల్ని ఓడించి గెలుచుకొన్న విజయంతో నిర్మించుకొన్న భూతల స్వర్గాన్ని ఈ అమెరికన్ రాబందులు నేలమట్టం చేశారు.

(బయట మళ్ళీ గోల, పెద్దగా అరుపులు, తుపాకులు కాల్చుతున్న ధ్వని, యినిక్విలాబ్-జిందాబాద్, ఐక్యకొరియా జిందాబాద్, ఐక్యకొరియా-జిందాబాద్ అని నినాదాలు వినిపిస్తయి. కిటికీలో గుండా చూస్తాడు సేన్.)

సేన్:- నాన్నా, మన గెరిల్లాలే! మన గెరిల్లాల్నే పట్టుకువెళుతున్నారు నాన్నా!

తాత:- పట్టుకు వెళతారు, ఈ దేశంలోనే కాదు, ఏ దేశంలోనైనా సరే. స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం, కళా సంస్కృతుల కోసం, పౌరసత్వ హక్కులకోసం. చనిపోయేదే దేశభక్తులు, ఆ దేశభక్తుల రక్తంతో పునీతమైనదే మాతృదేశం.

యువ:- ఆ దేశభక్తులే దేశాని కిట్లాంటి అనర్థకాలు తెచ్చిపెట్టేది.

కార్మి:- ఛీ! వెధవా!

సేన్:- వీడు వట్టిశుంఠ, ఒక ధనవంతుడి బిడ్డ. కుక్కలా బ్రతకటానికి ఆ అమెరికన్ల బూట్లు మోస్తాడు.

యువ:- విన్నావా తాతా! నీ కొడుకంటున్న మాటలు నేను శుంఠనా! నేను పిరికిపందనా?

తాత:- అందులో సత్యం లేకపోలేదు బాబూ! నీ భార్యా బిడ్డలకోసం, నీ తల్లితండ్రుల కోసం, నీ దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం ప్రాణాలర్పించే దేశభక్తుల్ని నిందిస్తావా?

యువ:- నిందించటం కాదు, నాకే అధికారముంటే మిమ్మల్ని నిలువునా ఉరితీయించే వాడిని. దేశం పేరుతో కుట్రలు పన్ని యుద్ధాలు తెచ్చింది మీరే!

ముగ్గురూ:- మేమా?

యువ:- ఔను మీరే!

సేన్:- ఓరి ద్రోహి!

యువ:- ఆ అమెరికన్లే నయం. వాళ్ళు శాంతికాముకులు, దైవ భక్తులు. వాళ్ళను మీరు నిందిస్తారా? మీ లాంటి చీడపురుగుల వల్లనే ఈ కొరియా గడ్డ యిలా నాశనమై పోయింది!

తాత:- మా వల్లా?

కార్మి:- తల్లి పాలుత్రాగి రొమ్ములు కోసే గాడిద వీడు.

యువ:- నేను గాడిదనా! మీలాంటి వాళ్ళను ఏరి ఏరి వెతికి వెతికి నాశనం చేయాలిసిందే. (రివ్వున పారిపోయాడు)

కార్మి:- వీడు వట్టి ద్రోహి, వీడిని దగ్గరకెలా చేరనిచ్చారు కామ్రేడ్స్? మీరు త్రాచుపాముని పక్కలో పెట్టుకుని నిద్రపోతున్నారా?

సేన్:- విన్నావా నాన్నా! ఆ ద్రోహి అన్నమాటలు?

తాత:- విన్నాను బాబూ! వీడిని, వీడితండ్రిని, అందర్నీ నేను యెరుగుదును. పాపం కుటుంబమంతా నాశనమైపోయిం దని, దిక్కులేని వాడని జాలితలిస్తే, వాడు మనల్నే నిందించి పోయాడు. వీడితండ్రి అధిక వడ్డీలతో ప్రజల్ని పీల్చుకు తింటుండేవాడు. మన పంచాయితీ ప్రభుత్వాలు యేర్పడినాక వీడి ఆస్తినంతా సమాజపరం చేశారు.

కార్మి:- అందుకే వీడికా కడుపుమంట. ఈ ద్రోహిని ఒక కంట కనిపెట్టి వుండాలి. ఆ అమెరికన్ వాళ్ళకు మన ఆచూకీ తెలియజేస్తాడేమో?


సేన:- అలాంటి నీచుడే వాడు, వాడిని కాల్చివేసినా పీడ విరగడయ్యేది. శత్రుశేషం, ఋణశేషం ఉండగూడ దంటారు యిందుకనే.

(యింతలో బయట తుపాకి కాల్పు, బూట్లధ్వని. ఒక అమెరికన్ కెప్టెన్, సార్జన్, యిద్దరు సైనికులు, పారిపోయిన యువకుడు, తిరిగివస్తారు. వస్తూనే తుపాకులూ, పిస్తోళ్ళు యెక్కుపెట్టుకు వచ్చారు.)

కెప్టె:- Hands up ఆయుధాలుప్రయోగింప సాహసించారా? జాగ్రత! తలలెగిరి పోతయ్యి. వెతకండి వాళ్ళ గుడ్డలన్నీ, ఆయుధా లున్నయ్యేమో?

యువ:- ఇదిగోనండి ఈ కూలివెధవ దగ్గర ఒక ఆయుధముంది చూడండి, వీడు గేరిల్లా?

కెప్టె:- (దగ్గరకొచ్చి, ముఖంమీద కొట్టి) ఏరా బానిసవెధవ, ఆయుధాలు గూడ ప్రయోగిస్తున్నావ్రా! (గ్రంథాలం...



యువ:- (సార్జన్‌ని చూపిస్తూ) వీడూ ఈ ముసలాడి కొడుకే నండి, చూడండి వీళ్ళిద్దరూ అ గెరిల్లాల్లోని వాళ్ళేనండి.

కెప్టె:- (సార్జన్‌ని అనుమానంగా చూస్తూ) వీళ్ళు నీవాళ్ళేనన్న మాట, వీళ్ళంతా మిత్రరాజ్యాల పైన యుద్ధం ప్రకటించిన ద్రోహులు, వీళ్ళు నీ బంధువులా?

సార్జ:- ఔను, నా బంధువులే, కాని వాళ్ళకూ నాకూ సంబంధం లేదు, వీళ్ళు ద్రోహులు.

కెప్టె:- అయితే నిన్ను నమ్మడం యెలా? వాళ్ళకూ నీకూ సంబంధా లున్నయ్యేమో తెలియడం యెట్లా?

సార్జ:- హానరబుల్ కెప్టెన్, అలాఅనుమానించ నవసరంలేదు. నేను ఈ ద్రోహుల్ని వదలిపెట్టి రెండున్నర సంవత్సరా లైనది.

యువ:- ఔనండి, నాకూ తెలుసు.

కెప్టె:- సరే! అయితే నీ తండ్రిని, నీ తమ్ముడిని అరెస్టుచేసి ఆ గెరిల్లా క్యాంపు లెక్కడున్నయ్యో అడుగు.

తాత:- నేను ఆ పశువుకు తండ్రినా? వాడు యేనాడో ఆ అమెరికన్ బందిపోట్లకమ్ముడు పోయిన నీచుడు.

కెప్టె:- షటప్! (చెంపపైకొట్టి) బానిస వెధవ; మీరంతా బానిసలు, కుక్కలు, మిమ్మల్ని రక్షించటానికి, మీ శాంతి కాపాడటానికే మేము వచ్చింది, నోరెత్తితే తలలు యెగిరిపోతయి, జాగ్రత్త!

సార్జ:-నాన్నా,ఒక్క గొర్రెవెళ్ళి కొండను ఢీకొని యేంచేస్తుంది? మనమంతా యుద్ధాన్ని విరమించి, మిత్రరాజ్యాల

ఆజ్ఞలకు బద్ధులమై వుండాలి, అమెరికాకు సహాయం చేయాలి.

కెప్టె:- చెప్పు! అలాచెప్పు! మతిపోయిన ఈ ముసలి వెధవకు నచ్చేటట్లు చెప్పు సార్జన్.

యువ;- అమెరికన్‌లంటే దైవభక్తులు, వాళ్ళు యెల్లప్పుడూ వలసదేశాల శాంతినే కోరుతూవుంటారు.

కెప్టె:- (పెద్దగా నవ్వి) వెరిగుడ్, వెరిగుడ్ మేన్.

యువ:- మీరు కమ్యూనిష్టులూ, బందిపోట్లు.

సేన్:- నిజమే! బందిపోట్లు కొరియన్లా? అయిదువేల మైళ్ళ దూరాన్నుండి వచ్చి, ఈ చిన్న కొరియా గడ్డను బందిపోటు చేస్తుంది యెవరూ?

తాత:- గ్రీక్ దేశాన్ని బందిపోటు చేస్తుందీ కొరియన్‌లేనా? ఫిలుప్పైన్‌ని బందిపోటు చేస్తుంది కొరియన్‌లేనా?

కెప్టె:- (క్రోధంతో) ఏయ్! స్కౌండ్రల్.

తాత:- యిప్పుడు బర్మా, మలయా, యిండోచైనాలను బందిపోటు చేస్తుంది కొరియన్‌లేనా? మొన్నటిదాక చైనాను బందిపోటు దొంగల్లా దోచుకుంది కొరియన్‌లేనా?

కెప్టె:- షూట్‌హీం (సైనికులు కాలుస్తారు. తాతకు అడ్డువచ్చి ఆ దెబ్బ తగిలి కార్మికుడు పడిపోయాడు.)

సార్జ:- ఎంత హద్దుమీరి పోతున్నారు నాన్నా, మీరు.

సేన్:- హద్దుమీరి పోతున్నాం, దురాక్రమణకు పరదేశాల మీదపడి అమాయకుల గొంతులు కోస్తున్నాం.

తాత. సేన్:- హద్దుమీరి పోతున్నాం!

కార్మిః- (హీనస్వరంతో) కామ్రేడ్స్! నా కోసం మీరు విచారించకండి. ఈ అమెరికన్ రాబందులకు లొంగకండి. ప్రాణాన్నైనా కోలుపోండి కాని, దేశస్వాతంత్ర్యాన్ని మాత్రం కోలుపోకండి.

కెప్టెః- స్వాతంత్ర్యం! కూలికుంకలకు కూడా స్వాతంత్ర్యం! యిదిగో స్వాతంత్ర్యం (కాలితో తన్నాడు)

తాతః- ఆయుధబలం చేతిలో వుందని మనుష్యుల్ని అవమానిస్తావా? జాగ్రత్త! ఎప్పటికైనా ఈ ప్రతీకారాన్ని పొందితీరుతావు.

కార్మిః- అబ్బా! కామ్రేడ్స్! యికనేను బ్రతకను, మీ గొంతులో ఊపిరున్నంతవరకూ ఐక్యకొరియా నిర్మాణం కోసం మీ రక్తాన్ని ధారబోయండి, మన మాతృదేశ స్వతంత్ర పోరాటాన్ని మాత్రం మానకండి!

సేన:- లేదు కామ్రేడ్! ఎన్నటికీ ఈ అమెరికన్లకు లొంగం. మిత్రరాజ్యాల పేరుతో మన దేశ స్వాతంత్ర్యోద్యమాన్ని రక్తపుటేరుల్లో ముంచుతున్న ఈ నరహంతకులకు లొంగం. ఒక్క యాభైరాజ్యాలే కాదు, యింకా యాభై రాజ్యాలుఏకమై మనపై దండెత్తివచ్చినా మన స్వతంత్ర విశాల ఐక్యకొరియా నిర్మాణాన్ని యెవ్వరూ ఆపలేరు.

కార్మిః- ఏదీ, ఒక్కసారి - ఐక్యకొరియా నినాదం చేయండి. యినక్విలాబ్-జిందాబాద్! ఐక్యకొరియా-జిందాబాద్ (మెల్లగా అంటాడు)

సేన, తాతః- ఐక్యకొరియా-జిందాబాద్! యినక్విలాబ్

జిందాబాద్! (మెల్లగా అంటూ కార్మికుడు చని పోతాడు)

కెప్టె:- మిష్టర్ సార్జెంట్, యేమటలా గ్రుడ్లప్పగించి చూస్తావు? ఆ ద్రోహులు అలా చెలరేగిపోతుంటేను, మెత్తగా దన్ని నోరుమూయించు.

సార్జెంట్:- అలాగే హానరబుల్ కెప్టెన్. మీరు నాకు కొద్దిగా టైమివ్వాలి.

యువ:- వద్దండి. వీడికి టైమిస్తే, ఆ ద్రోహులతో కలసి మన పైన కుట్రపన్నుతాడు.

కెప్టెన్:- షటప్! మధ్య నిన్నెవరు మాట్లాడమన్నార్రా రాస్కెల్.

సార్జెంట్:- ఏం నాన్నా! ఇప్పుడన్నా చెప్పేసేయి, ఆ గెరిల్లా క్యాంపు యెక్కడ? ఆ రహస్యాన్ని చెప్పాలి నువ్వు.

తాత:- చెబుతాను, విశ్వాసఘాతకుడా! నన్ను నాన్నా అని పిలవటానికి సిగ్గులేదు నీకు. నీ తల్లిని, నీ మేనకోడల్ని, నీ తమ్ముళ్ళనీ. నీవాళ్ళనందర్నీ చంపింది ఎవరూ?

సేన:- చెల్లెల్ని నడివీధిలో గుడ్డలూడదీసి, మానభంగంచేసి చంపిన ఈ అమెరికన్ నరహంతకులతో నువ్వు స్నేహం చేస్తున్నది చాలక, మమ్మల్ని కూడా నా తోబుట్టువులకు ద్రోహం చేయమంటావా?

యువ:- అవును, నా భార్యను, నా పిల్లల్నికూడా చంపింది వీళ్ళే (ఏడ్చాడు).

కెప్టెన్:- ఎవరు చంపారురా ఫూల్! వీడ్ని పట్టుకెళ్ళి కాల్చె

య్యండి, ఊఁ! పట్టుకెళ్ళండి. (పట్టుకెళుతూఉంటారు, యువక కొరియన్ పెనుగులాడుతూ కేక లేస్తూఉంటాడు)

యువ:- వద్దు, మీకు సేవచేస్తా, మీకు బానిసగా ఉంటా, మీ ప్రభుత్వాన్నే బలపరుస్తా, నన్ను రక్షించండి, నన్ను, తాతా! తాతా! (తీసికెళ్ళి కాలుస్తారు. కెప్టెన్ పెద్దగా నవ్వుతాడు, బయటనుండి పెద్దగావు కేక వినుపిస్తుంది)

తాత:- కాల్చండి, ఈ దేశాన్ని, ప్రజల్ని, సాహిత్యాన్ని, మా సర్వస్వాన్ని కాల్చండి, మీ పైశాచిక కృత్యాన్ని, మీ బందిపోటు తనాన్ని, నిలుపుకోండి; కాని మీరెన్ని చేసినా సరే, ఏ కొరియా దేశభక్తుడూ నీకు లొంగడు. ఇక మీరీ గడ్డమీద కాలు నిలుపలేరు.

సార్జెన్:- ఊరోక్ నాన్నా! ఊరోక్.

తాత:- ఛీ దురాత్ముడా! నీకు నేను తండ్రినికాను, నీవు నా కొడుకువి కాదు. నిన్ను నాకొడుకని చెప్పుకోవటం కూడా నాకే సిగ్గు. ఎన్ని కుటుంబాలు, ఎంతమంది అమాయకుల్ని గొంతులుకోశారీ హంతకులు, ఈ ద్రోహులకు నన్ను బానిసగా చాకిరీ చేయమంటావా? నీలాగా వాళ్ళ బూట్లు మోయమంటావా! పో! నా ఎదుటనుండి, తక్షణమే పో!

కెప్టెన్:- ఏయ్! ముసలి గాడిదా, ఏమన్నావురా? (కొట్ట బోయాడు.)

సార్జెన్:- (ఆపి) హానరబుల్ కెప్టెన్, ఈసారికి మా నాన్నను క్షమించండి.

సేన్:- ఆ నీచుడుగాదు. క్షమించాలిసింది, మిమ్మల్ని మేమే క్షమించాలి బందిపోటు దొంగల్లా దేశంమీదపడిదోచుకుంటున్నారు, యుద్ధాల్ని రెచ్చగొట్టి యిలాంటి వలసదేశాల్ని నాశనంచేస్తున్నారు.

సార్జన్:- మీరు ప్రమాదాల్ని కొని తెచ్చుకుంటున్నారు. మీ ప్రాణాల్ని కాపాడలేని పరిస్థితి నాకు తెచ్చిపెడుతున్నారు.

తాత:- ప్రాణం, ప్రాణమంటే నీకు తీపి, ఈ నీఒక్కడి ప్రాణం కోసం, నీ సుఖం కోసం, నీ జాతికి, నీ తల్లిదండ్రులకు, నీ అక్కచెల్లెళ్ళకూ, ద్రోహం చేసిన నీచుడివి, అమెరికన్, కొరియన్ మార్షల్సు కోసం, తుపాకిపట్టి, ముక్కోటి కొరియన్ ప్రజల స్వాతంత్ర్యోద్యమాన్ని, రక్తపు మడుగుల్లో ముంచి, నీ దేశ స్వాతంత్ర్యాన్ని, తాకట్టు పెట్టిన రాక్షసుడివి. క్షుద్రుడివి పో! తక్షణం పో! నా యెదుటనుండి. (తాత వెనక్కు తిరిగాడు, కెప్టెన్ గొణుగుడిస్తూ, పిస్తలు ప్రేల్చాడు, తాత పడిపోయాడు, సేన్ తాతను పట్టుకున్నాడు.)

సార్జన్:-ఓరి దురాత్ముడా! నా తండ్రినే కాలుస్తావా! (సార్జన్ వెంటనే పిస్తలుపేల్చటానికి ప్రయత్నిస్తాడు కెప్టెన్ పిస్తలు ప్రేల్చాడు, సార్జన్ ముందుగా పడిపోయాడు, కెప్టెన్ పారిపోతూ బయటపడిపోయి పెద్దగా కేకవేశాడు.)

తాత:-అయిపోయింది, సర్వనాశనమైపోయింది నాయనా! సేన్.

సేన్:- (కన్నీటితో) నాన్నా!

తాత:- కన్నీరు పెట్టుకోకు నాయనా! యిక నా జీవితాధ్యాయం ముగియబోతూవుంది, నా ప్రాణాలున్నంతవరకూ

ఈ దేశాన్ని, ఈ ప్రజల్ని, ముఖ్యంగా ఈ గ్రంథాలయాన్ని ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించిన సంగతి నీకూ తెలుసు.

సార్జ:- అబ్బా! తమ్ముడూ! నాన్నా, నన్ను క్షమించండి. ఈ ప్రాణానికి భయపడే, ఈ కొరియా గడ్డకు ద్రోహం చేశాను. (తెరలో తుపాకి కాల్పులు, పెద్దగా ప్రజల కోలాహలం, ఐక్యకొరియా-జిందాబాద్, యిన్‌క్విలాబ్ జిందాబాద్) అదిగో ఈగ్రామం విముక్తమైనది నాన్నా! ఈ వీరకొరియాయే జయిస్తుంది, నా లాంటి పిరికి పంద లకు భవిష్యత్తు లేదు. అబ్బా! నాన్నా........ తమ్ముడూ...... (పెద్దగా తన్నుకుని చనిపోయాడు.)

సేన్:- నాన్నా, అవిగో! మన ప్రజాసైన్యాలొచ్చినై నాన్నా! ఈ గ్రామం విముక్తమైనది నాన్నా! ఆ అమెరికన్ హంతకులు ఈగ్రామాన్ని వదలి పారిపోతున్నారు నాన్నా!

తాత:- (సంతోషంతో ఆనందబాష్పాలు రాలుస్తూ) అలాగా నాయనా! నా గ్రామమే కాదు; ఈ దేశమే జయిస్తుంది, తప్పక జయిస్తుంది. ఏదీ బాబూ! ఆలైబ్రరీలో ఆ యెడమవైపు బీరువాలో నేను ప్రియంగా దాచుకున్న పుస్తకంవుంది తీసుకురా బాబూ! (సేన్ వెంటనే వెళ్ళి ఆ గ్రంథాన్ని తెచ్చాడు. ఆ గ్రంథం ఎఱ్ఱగుడ్డలో చుట్ట బడి వుంది. తాత ఆగుడ్డ తీశాడు, వెంటనే ఆ గ్రంథం పైన "శాంతి సందేశం" అని వ్రాయబడివుంది. ఆ పుస్త కం సేన్‌కు యిస్తూ) "యిదిగో నాయనా సేన్! ఈ చిన్న గ్రంథ మనే ఆయుధంతో ఒక్క అమెరికానే

కాదు; ఎన్ని రాజ్యాలనైనా జయించగలవు, ఈ విజ్ఞానం ఈ దేశం, దురాక్రమణ పరులకు తాకట్టు పెట్టకండి బాబూ! అదే నా ఆఖరు కోరిక" అబ్బా! (యింతలో పెద్దగా సినాదాలు, కోలాహలం, వినుపిస్తయి, తాత నినాదాలు మెల్లగా అంటూ ప్రాణం విడుస్తాడు.)

(యింతలో గేరిల్లా యోధుడు వస్తాడు.)

గేరి:- కామ్రేడ్! ఏమిటీఘోరం, తాతా నీవు మరణించావా! నీవు మరణించినా, నీ ఆశయాలు మరణించలేదు; నీ గ్రామం విముక్తమైనది; కాని, ఈ సంతోషాన్ని అనుభవించే అదృష్టం నీకు లేకపోయింది.

సేన్:- కామ్రేడ్! అమెరికన్ నరహంతకులు ఈ కొరియా గడ్డమీద చేస్తున్న రాక్షస కృత్యాలకు యిది చిహ్నమాత్రమే! మా నాన్ననే కాదు, యిలాంటి దేశభక్తుల్ని యెందర్ని ఆ అమెరికన్ సామ్రాజ్య పిశాచం బలిగొందో మనం కళ్ళారా చూచాము.

గేరి:- మనం ఈ కొరియా గడ్డమీద, ఈ యుద్ధపిశాచాన్ని. ఈ హంతకరాజ్యాన్ని నాశనం చేసితీరాలి. (యింతలో గ్రామ ప్రజల కోలాహలం, పూర్వపు నినాదాలే యిస్తూవుంటారు.)

సేన్:- ఈ మృతవీరులు, దేశంకోసం, కళాసంస్కృతుల కోసం. మానవ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం, వీరుల్లా పోరాడి మరణించారు. ఈ వీరుల ఆశయాల్ని మనం సాధించాలి! ఈ ఆశయంకోసం మన రక్తబలిదానంతో భవిష్యత్తును స్థాపించాలి!


గేరి:- కా(మేడ్ ! యిక వెళదాంరాండి, మనం గూడా ఆ ప్రజల ఆనందోత్సవాల్లో కలసి, ఈ మృతవీరులకు దహన సంస్కారాలు యేర్పాటు చేద్దాం.

షేక్:- యిక పదండి, యిప్పటికి ఈ అమెరికన్ నరహంతకుల నుండి ఈ గ్రామాన్ని విముక్తి చేసుకున్నాం, యిక ముందుగూడా, ఈ యుద్ధోన్మాదులను గోరీకట్టి, శాశ్వత శాంతిని స్థాపిద్దాం !

గేరి:- అదే మన మృతవీరుల సందేశం !

ఇన్‌క్విలాబ్ - జిందాబాద్ !
ఐక్యకొరియా - జిందాబాద్ !
ఐక్యప్రజాపోరాటం - వర్ధిల్లాలి !


(నినాదాలు యిస్తూవుంటే తెరపడుతుంది.)



తెలంగాణా వీరయోధులు


(బుర్రకథ)

(రేణుకుంట పోరాటం : 1947 సం॥)



రచయిత

టి. రామాంజనేయులు



విశాలాంధ్ర ప్రచురణాలయం,
విజయవాడ.

ప్రచురణ నెం. 62 రు.


ప్రథమ ముద్రణ
జులై '53
రెండవ ముద్రణ
మార్చి '54

నాలుగణాలు

శ్రీ వేమ[illegible] [illegible]సుము
తెలు[illegible] ([illegible])

వాహిని ప్రెస్,
విజయవాడ-1

అంకితము



విశాలాంధ్ర పోరాటములో, అచంచల విశ్వాసముతో, అనంత త్యాగాలనుజేస్తూ, నాతో కలసిమెలసి పనిజేస్తూ, నన్ను విడచిపోయిన కామ్రేడ్స్ తెలంగాణా గెరిల్లాయోధులకు, విశాలాంధ్ర అమరవీరులకు.

—రచయిత.

ప్రార్థనగేయం

తెలగాణా అమరుల్లారా
తెలుగు జోదుల్లారా
ఇవిగో మా విప్లవ జోహార్లు
ఓ..... తెలంగాణ తెలుగన్నల్లారా
ఇస్తున్నా మిదె వీరాంజనాలు ॥ఓ॥
మీా రోడ్చిన కవోష్ణ రుధిరం
వృథాగాదది విప్లవాగ్నిరా
దహిస్తుంది దుష్టపాలనన్
తరింపజేస్తుం దీలోకాన్నే ॥ఓ॥
యే ఆశయ సిద్ధికోసమై
మీా ప్రాణా లర్పించారో
ఆ యాశయ మీాడేర్చంగా
చేస్తున్నాం శపథం నేడే ॥ఓ॥

వంతపదాలు

1 వినరా నైజాం తెలుగు ప్రజల ఘన, వీరసమర చరిత
2 గెరిల్లాయోధుల తెగువ జూడుడి, పరాక్రమము గనుడీ
3 ఖలులౌ నైజాంరక్కసిమూకల ఘోరాల్ వినరయ్యా
4 కాంగ్రేసంటే ఆశలెందుకిక కష్టజీవులారా
5 కాంగ్రేస్ సంఘము దొరల సంఘము–కూలిరైతులారా.

(ఈ పదాలను కథలో భావానుయుక్తంగా వుపయోగించి పాడాలి)

కథా ప్రారంభము

వచనము: అయ్యా! ఆరువందల సంవత్సరాలుగా, ప్రజానీకాన్ని బడి జలగలవలే పీల్చి పిప్పిగాజేస్తున్న, నైజాం దోపిడీపాలనను అంతంజేసి, విశాలాంధ్రను స్థాపించుకొనేందుకు, దున్నేవానికే భూమిని పొందేందుకు, తెలంగాణా ప్రజ లనంత త్యాగాలుజేస్తూ, ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టుపార్టీల నాయకత్వాన బ్రహ్మాండమైన సాయుధ పోరాటాన్ని వీరోచితంగా సాగించారు. అట్టి మహాపోరాట చరిత్రలో, రేణుకుంట గెరిల్లాయోధుడు రామిరెడ్డి గాధ ఏ విధంగానయ్యా అంటే—

హైదరాబాదున కామడదూరా - నలరారెడు పల్లె
రేణుకుంటయను నామంబున కడు - రాణించెడు పల్లె
రేణుకుంట పేరంటే నైజాం - రాక్షసులకు మంట
ప్రాణాలొడ్డి పేరుగన్న వీ - రాంధ్రభూమి పంట
మిలటరి గుండెలు ఝల్లుఝల్లుమన - మ్రోగు సమరగంట
ప్రజారాజ్య పోరాట చరిత్రకు - పంట రేణుకుంట.

వ॥ ఆ రేణుకుంట ప్రాంతాన ప్రజల జీవిత మేలాగుందయా అంటే—

దొరగడీలలో ఆజన్మాంతము - తరతరాలుగాను
పరమ నీచమౌ వెట్టిచాకిరి - మెడకురి యాప్రజకు
అన్నికులంబులవారు వెట్టి చే - అలమటించుచుండు
తన్నులు, బూతులు దొరలతో నెప్పుడు - తప్పవు ప్రజకయ్యా

వ॥ ఇంకా అచ్చటి దోపిడీదార్లు, ప్రజల నేవిధంగా బాధించుతారంటే—

పెండ్లిండ్లకు పేరంటాలకు - తిండిలేని ప్రజల
దండించియు చందాల్, నజరానాల్ - ధర్మాలని దోచు
మేడలుగట్టిన, ముసలిది జచ్చిన - మామూళ్ళివ్వాలి
పోడుగొట్టిన భూములు గుంజి - పొట్టగొట్టు ప్రజల
పొట్టకులేదని నోరెత్తడిగిన - వెట్టికి వెనుకైనా
బట్టలు విప్పి చీమల చింతకు - కట్టి చావ బాదు
బ్రతుకు భారమై యెందరో రైతులు - భూమి కోంపలూడి
పట్టణాలలో రిక్షాల్లాగుచు - బ్రతుకుచుండిరయ్యా.

వ॥ పట్టణాలకు వలసబోయిన రైతుల నెవ్వరైనా ప్రశ్నించితే యేమంటారండీ—

పగవారల కొద్దయ్యా నైజాం - ప్రజల పాను బ్రతుకు
రగతముతాగే సర్కారయ్యా - రాబందులు దొరలు
రాకసి పాలననుండి బైటపడి - పట్టణాలలోన
రిక్షాలాగుటె స్వర్గమయ్యా యిదె - రాజా బ్రతుకయ్యా.

వ॥ ఈలాంటి చరల కాలవాలమైన నైజాం పాలన అంతం గావాలనేవాంఛ ప్రజల్లో గాఢంగావుంది. కాని, దారి తెన్నుతోచక ప్రజలు యెదురుచూస్తున్నారు. యింతలో ఆంధ్ర మహాసభ, ప్రజల కష్టాల నంతం జేసేటందుకు గ్రామ గ్రామానా ప్రజల్ని సంఘటిత పరుస్తూ, సంఘబలంతో, దోపిడీవిధానా న్నెదిరిస్తూ పోరాటాం సాగిస్తూంది. యీ సమయంలో—

రామిరెడ్డియను రైతుయువకుడా- రేణుకుంటలోనా
పాములాగు బుసగొట్టి లేచెనా-ప్రజల మేలుకోలుప

ప్రజారాజ్యమే ప్రజకు రక్షయని-పోరాడుచునున్న
ప్రజా సంఘము, ఆంధ్రమహాసభ-పిలుపునందినాడు
సంఘాశయముల నామూలాగ్రము-చక్కగ గుర్తించి
రంగములోన దూకినాడయా-రామిరెడ్డి నాడు.

వ॥ రామిరెడ్డి వునికి ఎలాంటిదయ్యా అంటే—

దొరలు వారి తాబేదారులకు-తలనొంచనివాడు
పరుల కష్టమే తన కష్టమ్మని-భావించెడి ఘనుడు
రామిరెడ్డి యన నా గ్రామంబున-శ్రామికులకు ప్రేమ
తామస మెరుగడు పేదలకన్న కడు-దయ గలిగుంటాడు
దోపిడికాబడు వారి జూచి తా-దుఃఖము పడతాడు
యేపనికైనా తెంపు జేయగల-వీరుండాతండు.

వ॥ యీలాంటి సుగుణవంతుడైన రెడ్డి ఆంధ్ర మహాసభను రేణుకుంటలో స్థాపించి, సంఘాశయాలను ఆ ఫిర్కా ప్రజల్లో యే విధంగా ప్రచారం సాగిస్తున్నాడంటే—

అన్నలార రైతన్నలార ॥తం॥
అన్నలార కూలన్నల్లార
దున్నువానికే భూమికోసము
దొరల దోపిడిని బాపేకోసం
నైజాంపాలన అంతంకోసము
ప్రజాతంత్ర పరిపాలనకోసము
విశాలాంధ్ర స్థాపించే కోసము
స్వేచ్ఛకొరకు ప్రజ సుఖముకోసము

ఆంధ్ర మహాసభ అరుగుదెంచెను
అందరు ప్రజ దానండన నిలచి
అన్నదమ్ములుగ చేతులు గలిపి
పోరాడంగా కదలండంటూ ప్రజల పిలచినాడు ||తం||

వ|| రామిరెడ్డితో పాటు, పేదప్రజలనుండి యువకులంతా సంఘంలో చేరి, ప్రజల కండదండలుగ నిలచి, ఆ ప్రాంత దోపిడీదారులకు వ్యతిరేకంగా పోరాటం సాగించారు. ఆ ప్రాంతమంతా యే విధంగా వుండయ్యా అంటే—

దొర గడీలలో వెట్టిచాకిరీ ||తం||
తోట్ల తోలుతగా అంతంబాయెను
శిస్తులలోనా సాగేదోపిడి
పన్నులపేరున ప్రబలిన దోపిడి
లేవిపేరున సాగేదోపిడి
లంచాల్ మామూళ్ళింకెన్నెన్నో
బంద్రైనాయిూ, సంఘముబాగా బలపడజొచ్చింది ||తం||

వ|| సంఘబలాన్నిజూచి గుండెలు జారిన దొరలు, పటేలు, పట్వారీలు, సర్కారు సాయంతో సంఘాన్ని నాశనం జేయ సమకట్టి—

సంఘనాయకుడు రామిరెడ్డిపై ||తం||
దొంగకేసుల బనాయించిరి
సంఘసేవకుల నందరి గూడా
జైళ్ళకు గుక్కగా ప్లాను వేసిరి
రాక్షీ మూకల కూడగట్టిరి

సభల నన్నిటిని చెదరగొట్టిరి
ప్రజల నడిపెడి యువకుల నందరి
పట్టి జైళ్ళలో పెట్టి సంఘమును
దెబ్బతీయవలెనంచు ప్రభుత్వము తలపడెనయ్యయ్యో ॥తం॥

వ॥ బహిరంగంగా పనిచేసే అవకాశాలు నానాటికి ప్రభుత్వం లేకుండా చేస్తూంది. ముఖ్య నాయకుడైన రెడ్డి రహస్య జీవితం గడుపుచు, ప్రజావుద్యమాన్ని శత్రువులచే నాశనం గాకుండా గట్టి పరుస్తున్నాడు. యిక తెలంగాణాలో ప్రభుత్వం యేవిధంగా తయారైందంటే-

రహస్య వుద్యమ మణచ మిల్టరిని రావించిందండి
గుహాలడవులు ప్రతిగుట్ట చెట్టులను గాలించిందండి
అశాంతియంచు ప్రజాసంఘముల నిషేంధించెనండి
అల్లరల్లరని సైనికపాలన బిల్లు తెచ్చెనండి.

వ॥ నిర్బంధ విధానం పెరిగేకొద్దీ ప్రజా వుద్యమం బల పడుతూ వుంది. యింటింటా ఎర్రజండాలు లేస్తున్నై. ఇది గమనిస్తున్న ప్రభుత్వానికి ఒక్క తన పోలీసు బలంమీద నమ్మకం సన్నగిలి రజ్వీమూక రజాకార్లను లేపి, తన పోలీసు, రజాకార్లతో యేవిధంగా తయారైందంటే-

పెద్దపెద్ద అయుధములు, బాంబులు ప్రేల్చి ప్రజలపైన
యుద్ధరంగమే జేసె గ్రామముల, వుద్యమంబు నణచ
పల్లెలలోనా పోలీస్ క్యాంపులు, బెట్టినారు, బాబు
గుల్లగుల్లగా బాదిరి ప్రజలను జైళ్ళ గ్రుక్కిరండి

పుస్తెలు సైతము వదలక ప్రజల ఆస్తులన్ని దోచి
మస్తుగ కొంపలుగాల్చి గ్రామముల మసికుప్పలు జేసె.

వ॥ గ్రామాలను చుట్టిముట్టి నైజాం రజాకార్లు, పోలీసు ప్రజల్ని గుంపులుగా పట్టుకెళ్ళి క్యాంపుల్లో యే విధంగా బాధించారంటే-

పచ్చివళ్లు బాలెంతల విడువక - పశులరీతి చెరచె
నెత్తుగు ముద్దలెయా పసిగందుల కత్తులతో తురిమె
గుడ్డలు విప్పి చూలాల్ గర్భము - కత్తుల కెరజేసె
గడ్డివాములలో బ్రతికిన వృద్ధుల - పెట్టి కాల్చిచంపె
లాగులుగట్టి తొండల నొదలి - లాటీలతో బాద
లాగిరి బ్రతికినవారి రోడ్లపై - లారీలకు గట్టి
చెట్లకుగట్టి తల్లక్రిందులుగ - చర్మాలను వొలచె
చిట్లగొట్టిరీ ప్రజల వీపులను - చింత బరికె విరుగ.

వ॥ ఈ విధమైన రాక్షస చర్యలు చేస్తున్న ప్రభుత్వము, దాని తాబేదారులపై ప్రజలు కసిబట్టారు. రహస్యంగా పని చేస్తున్న రామిరెడ్డిని తమ కడుపులో పెట్టి దాచుకుంటున్నారు. రామిరెడ్డిపై వారంట్లు సృష్టించి ప్రభుత్వం రేణుకుంట ప్రాంతంపై పశుత్వంగా మిట్లరీ దాడులు సాగించుతూవుంది. ఆనాటి కానాడు ప్రజల ధన, మాన ప్రాణాలకుగూడా రక్షణ లేకుండా పోతుంది. ఈ స్థితిలో ప్రజలు ఆత్మరక్షణకుసిద్ధమై యే విధంగా పోలీసు దాడుల నెదిరిస్తున్నారయ్యా అంటే—

మానముపోతే మనుగడేడ తెల - గాణ మగువకంచు
మానరక్షణకు రణరంగానికి - మగువ వురికివచ్చి
కొట్టెను నీచుల నైజాం కుక్కల - కండ్లనిండ కారం
పెట్టెను రోకలి మాడుపగుల పగ - బట్టి కాళియనగ!
కాడి, మేడి, వడిశాల, బండి వసి - కట్టె, బరిసె బట్టి
దాడి నెదిరి జయభేరి గొట్టె తెల - గాణ పేదరైతు
అంటుడొక్కల ఆకలిమంటల - అగ్నిమిన్నుదాక
అందిన ఆయుధమెత్తి కూలి - ముందుండి నిలచిపోరె
వుడుకురక్త ముప్పొంగ - తుపాకులు - యువకులంతబట్టి
చెడుగుడు లాడుచు మిల్టరిగుంపుల - నడుగడుగున యెదిరె

వ॥ ప్రజ లీరీతిగా ప్రతిఘటనను సాగిస్తుంటే పార్టీ ఆదేశానుసారం, ప్రజారక్షణ దళాలు యేర్పడాలనేది రామిరెడ్డి తలదాల్చి-

తాను కమాండరు యువకులు మొత్తము-దళసభ్యులుగాను
రేణుకుంట ప్రాంతీయ రక్షణకు - రెడ్డి దళముబట్టె
ప్రజల అండతో పోలీస్ క్యాంపులపైన దాడిజేసి
గజిబిజిపరచి శత్రువాయుధాల్, గుంజుకొనియె దళము

వ॥ ఆనాటి కానాడు గెరిల్లా దళాలు రాష్ట్రవ్యాపితంగా బలపడుతున్నై. ప్రజలకు బాగాగుండె నిబ్బర మెక్కువై గెరిల్లా దళాలతోపాటు, శత్రుక్యాంపులపై దాడులుజేసి, క్యాంపుల్లో చిక్కుకున్న తమతమవారిని విముక్తిజేస్తున్నారు. ఇక మన రామిరెడ్డిదళం యే విధంగా తయారైందంటే-

చిచ్చరి పిడుగుల రీతి తళుక్కని – చెట్లగుట్లనుండి
విచ్చలవిడి విహరించు రక్కసుల – కచ్చెబట్టి దళము
మెరుపు దాడులతో శత్రుసైనికుల – తరిమిగొట్టుచుండె
పిరికిబార అడుగడుగున 'మాటు' బెట్టి చంపుచుండె
ప్రాంతములోగల పోలీస్ కాంపులపైన దాళ్ళు జేసి
హంతకులను హతమార్చి ఆయుధాలార్జించెను దళము
దోపిడీదారులు వాసనకైనా – దొరుకరు పల్లెల్లో
యీ పగిదిని మన రెడ్డి ప్రాంతము విముక్తమయ్యింది

వ॥ ఈ స్థితిలో రేణుకుంటప్రాంత మేవిధంగా రూపొం దిందయ్యా అంటే-

చేయరు ఒక్కరు వెట్టిచాకిరి – సలాము మరచారు
ఈయరు శిస్తులు లేవీ పన్నులు – యే ఒక్కరుగూడా
"కాళ్ళకుమొక్కుత" "బాంచ"ననుట అట–కానరాదుఎచట
పెళ్ళాల్నమ్మి శిస్తుకట్టమను – బాధ లంతరించె
వెంకా, గురవా, యని పిల్చుట – యేవంకయె వినరాదు
బొంకుట, తిట్టుట, త్రాగుట, చోరీ – రంకుపనులులేవు
ఒక్కడుగూడా బానిసయై, చే - యెత్తి మొక్కబోడు
కత్తి, బరిసె, భర్మారు, రైఫిలుతో – కాలుదువ్వతాడు

వ॥ విముక్తమైన తమ ప్రాంతాన, ప్రతి గ్రామాన ప్రజలంతా తమ కిష్టమైన ఐదుగురు పెద్దల్ని యెన్నుకొని గ్రామపంచాయితీలు యేర్పాటుచేసుకున్నారు. తదనంతరం-

దున్నువానికే భూమిరా ||సై||
తిన్నగ పంచెను సోదరా
దోపిడిదారుల ఆస్తులు
పేదలకే పంచారురా
యెవరి భూములను వారికి
యిచ్చి చింత దీర్చారురా ||భళా||
రామిరెడ్డి ప్రాంతానికి మిల్టరి - రాదు పిరికిబారె
నలుగురు, పదుగురు, పాతికమంది నడువరండి బాట
రాయి, రప్ప, గుబురైన పొదలు యేం - కేవి కంటబడిన
రైఫిల్ ప్రేల్చక ముందుకెపోరు - రారు వూరునమ్మి

వ|| ఈవిధంగా పిరికిబారిన పోలీసు సంఖ్యను ప్రభుత్వం విపరీతంగా పెంచి పెద్దపెట్టుగా గ్రామాలపైకి పంపుతూవుంది. రేణుకుంట ప్రాంతాన్నిగూడా యే విధంగానైనా దెబ్బతీయకుంటే లాభంలేదని..

ఎనిమిది లారీల్ పెకపెకలాడగ ||తం||
ఎనుబోతుల్లా మిల్టరి గుంపులు
రేణుకుంటకే బయలుదేరెరా
బ్రెన్ను తుపాకులు, మిషన్ గన్నులు
స్టెన్ను, గ్రైడరు, టామీ గన్నులు
లారీల్ నిండా నింపినారురా
మారణమారణయంచుమోటారులు-మొరుగుతువస్తుండే||త||

వ|| గ్రామ రక్షణదళం వూరుకు ముఖ్యా సెంటరులో కాపలాకాస్తుంది. లారీల రాకడను గుర్తించి, వెంటనే డప్పు

శ్రీ వేమన గ్రంథాలయము
తెలప్రోలు. (కృష్ణా జిల్లా.)

చప్పుడుతో, కొమ్ముబూర శబ్దముతో గ్రామంలో ప్రజలకు. రెడ్డిదళానికి, శత్రురాకడను తెలిపింది. యిక రేణుకుంట పరిస్థితి యెలావుందంటే-

గుబగుబగుబగుబలాడె నూరురా ॥తం॥
గతగతగతలాడె భూమిరా
బరిసెలు కొందరు, బాకులుకొందరు
వడిశాలలు వడినిండ రాళ్లురా
నడి బజారులో నాయకుముందర
పిడికిలిబిగించి ప్రజలు నిలచెరా
ప్రతిఘటనకు తామంత సిద్ధమని, ప్రజ నినదించారు ॥తం॥

వ॥ దూరదృష్టి యంత్రంతో శత్రుబలమెంతో గమనించి అప్పుడే పరుగెత్తుకవచ్చిన కాపలాదళ సభ్యుడు రామిరెడ్డికి సంగతి తెల్పాడు. అప్పుడు రెడ్డి తనముందు సంసిద్ధంగా వున్న ప్రజలతో యేమంటున్నాడంటే-

రజాకార్లు, పోలీసులు మామూల్ రైపిళ్ళేగావు
రకరకాల పెద్దాయుధాలు రణరంగ ఫౌజులద్ది
ప్రమాదమిప్పుడు యెదిరించుట మన ప్రజలందరికయ్యా
గ్రామము వీడి తప్పుకొనుటయే - క్షేమంబనె రెడ్డి

వ॥ రెడ్డిమాటలకు కొంతమంది గ్రామయువకులు యేమంటున్నారంటే-

పరువుపోతె యీ ప్రాణాలెందుకు - పాడు పేరు మనకు
శత్రువు కిప్పుడు వెన్నుజూపుట - చాలా అలుసౌను

నిజమిప్పుడు శత్రువు కలుస్తై తే- నిలువలేము ముందు
విజయము లేక వీరస్వర్గమో- నిజమిప్పుడే తేలు.

వ॥ దూరదృష్టి లేకుండా, ఆవేశంకొద్దీ పోరాట వుత్సాహముకొద్దీ పలికిన రేణుకుంట యువకులమాటలు విన్న రెడ్డి యేమంటున్నాడంటే-

ప్రాణాలుంటేన్ తీరుస్తాం - ప్రతీకారమయ్యా
కానిపనికి ప్రాణంబుల నిచ్చుట - కటికి దోషమయ్యా
శత్రువుబలముగ వచ్చుచుండె మనశక్తి - చాలదిపుడు
యిప్పట్టున ప్రజలంతా గ్రామము విడచుట క్షేమంబు

వ॥ లారీల నూరుబయట ఆపి, వురుకు పరుగులతో పోలీసు వూరు నాక్రమించేందుకు సిద్ధమౌతుంది. వెంటనే గెరిల్లాదళం ప్రజలందరిని గబగబ వూరుబయటకు తప్పిస్తుంది. దాదాపు గ్రామమంతా నిర్మానుష్యమైంది. కాని రెడ్డిదళం మాత్రం గ్రామంలో నేచిక్కుపడింది. పోలీసు వూరుమొత్తము దడిగా చుట్టుకొంది. దళం తప్పుకొనే స్థితిలేదు. ప్రజలందరిని తప్పించామనే తృప్తితో దళమంతా సంతోషంగావుంది. ఇక దళం ఏ విధంగా వుందంటే-

జై జై జై జై ఎర్రజండాకే - జై జై యన్నారు
జయము జయము మన గెరిల్లాలకే - జయమగునన్నారు
ఇరువదేడుగురు ఆఫీసు డాబా కరుగు దెంచినారు
వరుసగ కంచెగోడ మాటుతో, వొదిగి పొంచినారు
పెటపెటపెటపెట ఠయ్యి ఠయ్యి మని ప్రేలె శత్రుగుండ్లు
పటపటపటపట పండ్లు నూరెరా బంగ్లాపై దళము

వూరిలోనికి మిల్టరి దూరగ - వీలుచిక్కనీక
హోరాహోరిగ గెరిల్ల యోధులు - పోరాడుచునుండె
నలుదిక్కులకు రైఫిల్ గుండ్లను - నడుపుచుండె దళము
నిలచిపోయెరా మిల్టరి వూరు - వెలుపలనే అపుడు
ఝామకాలమూ గెరిల్లాయోధులు - సాగించిరిపోరు
ఏమాత్రము చోరనీక శత్రువుల - నేడిపించినారు

వ॥ ఇంతలో దళానికి తోటాలు నిండుకున్నై. వెంటనే మన చింతలపూడి రామిరెడ్డి యేమంటున్నాడంటే-

సాహసెలక్కొ అన్నాడయ్యా ||తం||
గుండె నిబ్బరమె మేరువు మనకు
తూటాల్ ఖతమైపోతే పోయాయ్
నాటుతుపాకుల ధాటిచూపుదాం
పదిభర్మార్లు బాగావున్నై
మందుకూరి నా కందించండి
పందుల గుంపుల మందమందలుగ
పడగూల్చి మన ప్రతిభ చాటుదాం
తయారుగండని, మందుగూరుడని, తయారాయె రెడ్డి ||తం||

వ॥ వెంటనే తామున్న ఆఫీసు బంగ్లాలో, భద్రపరచ బడిన భర్మార్లు తెచ్చి వరుసగా మందుకూరి రెడ్డికందిస్తున్నారు దళ సభ్యులు. అరగంటకాలం కాల్పులు ఆగిపోయేటప్పటికి పోలీసు తిన్నగా వూరిలోకి చొచ్చుకొని మూడువందలమంది, ఆఫీసును చుట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. తెల్లని కాంతులతో ధగధగలాడే బంగ్లామీద రెపరెపలాడే యెర్ర

జండా క్రింద రామిరెడ్డి భర్మారు ధరించి యే విధంగా వున్నాడంటే-

కౌరవసేనల హతముజేసెడి - కౌంతేయుండనగ
రెపరెపలాడెను అరుణబావుటా - కపిధ్వజమో యనగ
తెల్లని కాంతులజిమ్మ బంగళా - తేరేమోయనగ
భర్మారే గాండీవంబనగా - ప్రస్ఫుటించెనయ్యా
వచ్చుచున్న యా మిల్టరి కుక్కల - కచ్చెబట్టి రెడ్డి
ఖచ్చితంబుగా దెబ్బపోక పడ .. గొట్టుచుండెనయ్యా
మూడువందల రైఫిల్ గుండ్లను - మూగవాటిజేసి
గాథ కసిని భర్మార్లలోనింపి - గుప్పుచుండె గుండ్లు

వ॥ బంగళా దాపుకు చొచ్చుక రావాలనే పోలీసు బంగళా కనతిదూరంలో పగ్గంపాడుగా పరుగులు తీస్తూంది. రెడ్డిచేతులోని తుపాకి అజేయంగా మోతలు పెడుతోంది. ఆ మహాసమర మేవిధంగా వుందంటే-

బ్రహ్మాండంబే బ్రద్దలుగాగ - భూమిదద్దరిల్ల
ఆరుగంటలు హోరాహోరిగ పోరునాగెనయ్యా
గురితప్పక ప్రతిగుండు శతృవుల - గుండె చీరుచుండె
అరె బాప్రేయని నలుబది శవములు - అప్పటికే దొర్లె!

వ॥ ఇక నైజాం సాయుధసైన్యం స్థితి యేవిధంగా వుందంటే-

వురుకుచుండెరా శతృబలంబులు - తిరిగిచూడకుండా
అరువదిమందికి గాయాల్ తాకి - ఆగమాగమాయె

బజారులన్నీ పీనుగెంటలై - భీతావహము గొలిపె
గజిబిజి అరుపులతోడ కాకి ఘూ - కములు నభమునిండె
కుప్ప తెప్పలుగ కూలిన నైజాం - క్రూరులగతిజూచి
కుప్పిగంతులతో రామిరెడ్డి - జైగొట్టసాగెనండి

వ॥ శత్రువుల స్థితి కంగారుగావుంది. క్షతగాత్రులు - చచ్చినవాళ్లు బజార్లవెంట దుమ్ముగరుస్తున్నారు. తతిమ్మా వారంతా పిరికిబారి కాళ్ళకు బుద్ధిచెప్తున్నారు. మిలటరీకమాం డరుగూడా గుండెలుజారి అదనపు బలాలకు కబురుబెట్టాడు. అరగంటలోనే అదనపు బలాలు రాగానే రేణుకుంట శత్రు సేనలతో నిండిపోయింది. శత్రువుల మందబలం చూచి మన రెడ్డి వుత్సాహంలో మునిగాడు. దెబ్బగాల్చి, మందునింపిన తుపాకికోసం చేయిజాచాడు రెడ్డి. అప్పుడు మందును కూరు తున్న దళ మేమంటుందంటే-

మందు లేదు క్రామేడా మొత్తము-మూటనిండుకుంది ॥తం॥
వుందా డాబాలోన లోగడ - మందుదాచినావా ?

వ॥ ఈ మాటలతో రెడ్డి తన చేతిలోవున్న తుపాకిని జారవిడుస్తూ యేమంటున్నాడంటే-

మందు లేదు క్రామేడ్సు యెచ్చట - మనకీ సమయాన
ముందు వెనుక లాలోచించక అవె - అందుకోండి బరిసెల్
వీరోచితముగ నింతవరకు మన - విధి నెరవేర్చాము
విజయము లేక వీరస్వర్గమో - వేరేదియు లేదు
పైకిరాక మన ప్రాణాల్ దీయుట - బ్రహ్మచేతగాదు
పైకివచ్చు పందలను బరిసెలతో - పొడిచి చంపుదాము

వ॥ వెంటనే బంగళాపై సిద్ధంగా వుంచబడిన బరిసెలను గెరిల్లాలందుకొని-

పిట్టగోడ రక్షణతో బాగా - పులులరీతి పొంచి
పట్టి బరిసెలను మాటుగాచె బల్ - పట్టుదలతో వారు

వ॥ బంగళామీదినుండి కాల్పు లాగిపోగానే మిల్టరీ కమాండరు పోలీసుతో-

చఢోరె చఢోరె బంగ్లామీదికి ॥తం॥
సమయము దొరికెను చఢోరె భాయి
అలసినాదిరా దళము యిప్పుడే
ఆఖరాయెరా మందు దళమునకు
అలసిన దళమును ఆ రాంరెడ్డిని
హతము జేయగా అదునిదేనురా
చఢోరెభాయి బంగ్లా వూపర్ - గడ్ భడ్ పడకండి ॥తం॥

వ॥ పాత సైనికులు పిరికిబారినా, క్రొత్తవారు ముందు రాసాగారు. కట్టగా బయలుదేరి బంగ్లా యెక్కేటందుకు ప్రయత్నిస్తున్నారు. యికపైన దళమేలాగుందంటే-

మెట్లమొగిని రాంరెడ్డి పొంచెరా ॥తం॥
వరుసగ దళము వొదిగి కాచెరా
మోకాల్ తండను వేసినారురా
చేత బరిసెలను బట్టినారురా
పైకివచ్చు పోలీసుడొక్కలో - పడెను బరిసెపోటు !

వ॥ ఆ దెబ్బతో వాడు మెట్లమీదనే కూలగా అతనిని

చూచి గాభరాపడి పై కెక్కుతున్న పోలీసంతా క్రిందికిదూకి పగ్గంపాములా పరుగెత్తుతున్నారు.

ఇదిచూచి మిల్టరీ కమాండరు.

భంచత్ పందులరీతిగ తిని తెగ – బలసి లాభమేమి
సిగ్గులేదు బద్మాషులు తుంకు – షరంగింతలేదు
యిందరముండి ఒక్కదళానికి బొందపెట్టలేమా
ఎందుకురా యీ పాడు బ్రతుకు ఛీ – పందులవలె బ్రతికి
దళము నాశనము జేసితిరా మీ – దర్జాసాగుతది
కోళ్లు చక్కని ఆడవాళ్లు మీ – కాళ్ల క్రిందకొచ్చు
సిరిసంపదలకు లోటులేదు దో – చినదంతా మీకే
పిరికిబారి పరుగెత్తారా మీ – ప్రాణాలను దీతు

వ॥ యీ గద్దింపుతో భయపడి కాళ్ళు నిలద్రొక్కుకు న్నారు. సైనికులు, ముఖ్యమైన సైనికాధికార్లు, రజాకారు పెద్దలు అక్కడనే పావుగంటకాలం చర్చించి, బంగళాకు చుట్టూవున్న చెట్లమీదికి సైనికుల నెక్కించారు. యికబంగ్లా మీదికి చెట్లుపైనుండి కాల్పులెలా సాగాయి అంటే–

ఫెట ఫెట ఫెట ఫెట రెడ్డిపైన భూమంతా దద్దరిల్లగా
బ్రెన్ను, స్టెన్, రైఫుల్, తో టేదార్ – గన్నులు ప్రేలాయి
వానరీతి గురిపించె రెడ్డిపై – నొక్కుమ్మడి గుండ్లు
వేనవేలుగా గుండ్లు తాకెరా – వీరయోధునకును
కూలినాడురా వీరుడు రెడ్డి – కొండలాగునచట

వాలిపోయెరా ప్రొద్దుజాలిగా - జాలువారె రుధిరం
విలవిల ప్రాణాలెగురుచుండె మన - విప్లవ యోధునకు
వలవల ఏడ్చెను రేణుకుంట భూ - వలయమంత అపుడు

వ॥ అంత్యదశలో నున్న చింతలపూడి యే విధంగా వున్నాడయ్యా అంటే-

ప్రాణముబోతూ కడసారిగ తన - ప్రజల మదిని దలచి
పిడికిలిబట్టి జైయని బంగ్లా - పైన ఎగురుచున్న
ఎర్రజండా నొకసారిజూచి వి - ప్లవపు దండమొసగి
ఎర్రబావుటా నీడన వీరుడు - విశ్రమించెనయ్యా.

వ॥ కొండలాంటి గెరిల్లాయోధుడు రెడ్డి కూలగానే, శత్రువుల కెక్కడలేని ధైర్యం కలిగి, నిరాయుధంగావున్న దళాన్ని బట్టేటందుకు సిద్ధమయ్యారు. బంగళా ముందుభాగ మంతా సైనికులు నేల యీనినట్లు నిండియున్నారు. యీ సమయంలో దళంనుండి తెగింపుగా-

ముగ్గురుయోధులు పోలీసుగుంపు - మధ్యన దూకారు
పగ్గంపాడుగా బరిసెలు విసరి భళియని పొగడంగ
అర్గురు కుక్కల యమపురి కంపిరి యీ తక్షణమందు
అనేకమందికి గాయాల్ తాకి - హడలెను పోలీసు

వ॥ చెల్లా చెదరౌతున్న సైనికులను కమాండరు బెద రించి ఒక్కుమ్మడిగా దళాన్ని పట్టాలని తెగింపుగా తయార య్యారు. యే విధంగానైతేనేమి కొందరు బరిసెదెబ్బలు తినైనా దళసభ్యులందరిని పట్టగలిగారు.

కరకురక్కసులు కసాయిలు - యీ నరహంతకులయ్యో
ఇరువదారుగురు గెరిల్ల యోధుల - వరుసగ నిలబెట్టి
గుండ్లు ప్రేల్చగా వరుసగపోలీస్ - గురిబెట్టి నిలువ
గుండ్లకు గుండెనిచ్చి వీరులిటు - గర్జించారండి
ఓరీ నైజాం కుక్కల్లారా - విజయము మాదేరా
మా రక్తపుబొట్టుకు వేలాది - వీరులుద్భవించు
మేము జచ్చినా సంఘము చావదు - మేము జేయులముర
తప్పక నైజాం పాలనగూలును - తుది విజయము ప్రజదే

వ॥ ఈ మాటలను వింటున్న సైనికులు గురిబెట్టిన బాణులు ప్రేల్చారు. వీరయోధులు ఒక్క గొంతుకతో నిన దిస్తూ యేమని తుది హెచ్చరిక జేస్తూన్నారయ్యా అంటే-

తెలుగుతల్లి విప్లవ వందనములు - శలవీయవె మాకు
తలపెట్టిన మా కోర్కె తీరకయె - బలియైతిమి మేము
మా సోదరులను నమ్మినాము మా - యాస దీస్తురంచు
దేశవిముక్తికి ప్రాణాలిస్తిమి - తీరెను మా బరువు
విడువలేక తమ ప్రాణాల్ వీరులు - విడచిరండి బాబు
గోసుగోసుమని ఏడ్చెనయ్యా - అనాడు తెల్గుతల్లి

వ॥ అంత నా రాక్షసులు లారీలపై తమవి, వీరయో ధుల గెరిల్లాల శవాలనుగూడ వేసుకొని, క్షతగాత్రుల హాహా రావాలతో బయలుదేరిపోతూ, దుర్మార్గులు రేణుకుంటపై కసితీరక గ్రామానికి నిప్పుముట్టించి వెళ్ళిపోయారు. సమయా

కోసం తహతహలాడే ప్రజానీకం ఒక్క పెట్టున బంగ్లా ముందుకొచ్చి—

కాలుచున్న తమ కొంపలార్పరు ||తం||
ఎవరి గృహములకు వారు వెళ్ళరు
రక్తముకాల్వల తిలకించారు
బంగ్లామీదికి పరుగెత్తారు
కొంగు ముఖాలకు పెట్టుక గోడుగోడు మనిరి ప్రజలు ||తం||

వ|| వృద్ధురాలైన మనరామిరెడ్డితల్లి యేవిధంగావిలపిస్తుందంటే-

అయ్యయ్యో మమ్మందరి నైజాం-దయ్యాలకు వదలి
వెళ్ళినావ స్వర్గానికి కొడుకా-యేమన్యాయమురా?
ఎన్నో ఆసలు బెట్టుకొంటి నిను-కన్ననాటినుండి
అన్నా, నిండినవా నూరేండ్లు-అప్పుడె నాతండ్రి
ఆరని చిచ్చు రగిల్చినావు పగ-దీరదాయె కొడుకా
కారదురా నా కంటనీరు యీ-క్ష్మాారులున్న వరకు

వ|| దుఃఖాన్ని యావత్తు మ్రింగి ఆ వీరమాత

కొడుకురక్తమే బొట్టుబెట్టుకొని-కాళిమూర్తి లాగా
పిడికిలిబట్టి ప్రజలజూచి తా-నుడివెనండి యిటుల
కొడుకు వొక్కగా నొక్కడు తానే-కోర్కెతో వొరిగాడో
నడుముగట్టి నా నాయన బాటనె-నడతు నిదియె పటిమ

వ|| ఆ వృద్ధమాతను జూచిన స్త్రీపురుషులంతా ఒక్కుమ్మడిగా

పిడికిలిబట్టి నైజాంపాలన-పడగూల్తు మటంచు
నుడివినారురా రేణుకుంట ప్రజ-నిండు దీక్షతోను
జయజయ ధ్వానాల్ మిన్నుముట్ట ప్రజ-చేతులెత్తి నిలచి
చేసిరి ప్రతిజ్ఞ నొక్క-గొంతుగా-స్త్రీలు పురుషులంత

వ॥ వెంటనే ప్రజలలోనున్న యువకు లప్పటికప్పుడే దళంగా ఏర్పడి:

చావలేదు మన గెరిల్లాలు-నైజామె జచ్చినాడు
చావలేదు మన రామిరెడ్డి న-క్షత్రమయినాడు
మిల మిల మెరసే జండాసూటిగ-మెరసె నదిగో మింట
వెలగుచుండె మన హృదయాల్లో-వీరుడు మనరెడ్డి
అమరవీరులా ఆశయసిద్ధికి-అలసట పడకుండా
సమరరంగమున నిల్తుము గెల్తుము-సత్యము మా దీక్ష
రామిరెడ్డి గాదిపుడు నాయకుడు-రామిరెడ్డి తల్లే
ఆ మాతను మన మనుసరించుదా-మని నుడివెను దళము
జయము జయము మనగెరిల్లాలకే-జయమని యన్నారు
జయధ్వానముల జేయుచుమంటల-చల్లార్చారండి.

సమాప్తం.

ఓ తెల్గుయోధుడా తెలగాణ వీరుడా
కాంగ్రెసు నిజరూపు గనవోయీ॥

కాంగ్రేసు సర్కారు వచ్చే ॥భళి భళి॥
కూడుగుడ్డలకు కరువచ్చే
భూములన్ని దొరలకిచ్చే
దొంగలకు అవకాశ మొచ్చే
రజాకార్లకు రక్షణిచ్చే
రౌడీలకే స్వేచ్ఛనిచ్చే

పాపినైజాముకు-రాజప్రముఖని గొప్ప
బిరుదమిచ్చి గద్దె నిల్పింది ॥ఓ॥

నిన్ను పెడమార్గాన బెట్ట ॥భ॥
దొరలరాజ్యము నిలువబెట్ట
రామరాజ్యము మాదటంచు
రైతుకూలీ రాజ్యమంచు
దున్నువానిదె భూమియంచు
దొరలగిరి హతమార్తుమంచు

చిలుకపలుకులతోడ-నక్కవినయాలతో
దురపిల్లసాగారు గనవోయీ ॥ఓ॥

నాలుగేండ్ల పైగ, మనము ॥భ॥
నరకమే అనుభవించాము

నైజాము తలదన్నినట్లు
నాజీల మరపించునట్లు
యమహింస లమలుపరచారు
భ్రమలున్న పారగొట్టారు
రామరాజ్యమొ యిద్ది-రాకాసిరాజ్యమో
రక్తాన ముంచెత్తినారు ॥ఓ॥

ఓటు హక్కు-దుగొనన్నారూ ॥భ॥
ఓటుతో గెల్వమన్నారూ
మనపాయకుల బట్టినారు
మాయకేసుల బెట్టినారు
జైళ్ళల్లో బంధించినారు
వారంట్లు బుట్టించినారు
ప్రజలహక్కు-లు మ్రింగినారు
రౌడీగుంపుల పెంచినారు
రౌడీరాజ్యము జేసినారు
చేతిగుర్తుకు ఓటు-జేసితే కాల్చమని
సిగ్గుపిడి తుపాకి జూపారూ ॥ఓ॥

ఎన్నితంటాల్ పడినగానీ ॥భ॥
విశాలాంధ్రతంతటగూడా
మన సంఘమే గెల్చెనోయి

ప్రజలదే విజయంబు భాయి
విశాలాంధ్రను పొందియున్న
విజయఫలితము జూతువోయీ

తెలంగాణ నాంధ్రలో గలిపి-సువిశాలమౌ
తెలుగు దేశము కండ్ల జూడాలోయ్ ||ఓ||

ఇంతకాలమునుండి నీవు ||భ||
ఎన్నొ త్యాగాల్ జేసినావు
ధనమాన ప్రాణాలుగూడ
తృణముగానూడ్చి నిలచావు
ఇంతగా త్యాగాలు జేసి
ఈ కాస్తకే బద్దకిస్తే
అన్యాయమౌతుంది భాయీ
అవకాశమెనుక బడునోయీ

బద్ధకించక దొరల-కాంగ్రెసు రాజ్యాన్ని
రద్దుపరచేవరకు పోరాడోయ్ ||ఓ||

సర్దారు పండితులు రానీ ||భ||
స్టేటు సర్దారులేగానీ
రామనందుం డెదురుగానీ
రాజప్రముఖులు బుట్టిరానీ
రాబందు లొకటయ్యిరానీ

రజ్వీలు కాంగ్రెసుగానీ
రైఫిళ్ళు బాంబులేగానీ
రణరంగ ఫౌజులే దిగనీ

అణచలేరోయ్ ప్రజల-నైజాముపలెవారు
అణగారి హతమయ్యిపోతారోయ్ ||ఓ||

అమరయోధుల మరవకోయీ ||భ||
రామిరెడ్డిని తలచుమోయీ
రక్తతర్పణ జేసిరోయీ
గుండ్ల కే రొమ్మిచ్చిరోయీ
ఓటనే యీ మెతో భాయి
పోటు పొడిచావంటెనోయి
ఆశయము సాధింతువోయి
అలసత్వమును పొందకోయి

విశాలాంధ్రలో ప్రజారాజ్య స్థాపనవరకు
విశ్రమించక పోరు సల్పాలోయ్ ||ఓ||



మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA125B130
పుస్తకం పేరు	శాంతి సందేశం
తారీఖు	30/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	59
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Ruksana
పేజీలు విడదీసినది	Ruksana
స్కాన్ చేసినది	Haseena
పరీక్ష చేసినది	ROHITH
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good